క్లుప్తంగా

తహసీల్దార్ ఆధ్వర్యంలో విద్యార్థుల అప్పగింత



తహసీల్దార్ సమక్షంలో కుటుంబసభ్యులకు విద్యార్థులను అప్పగిస్తున్న దృశ్యం

సీతానగరం: మండలంలోని జోగింపేట ప్రతిభా విద్యాలయంలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు జి.విల్సన్, జి.హర్షవర్ధన్‌లను తహసీల్దార్ ఎన్వీరమణ ఆధ్వర్యంలో సిబ్బంది కుటుంబీకులకు మంగళవారం అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. ఆ ఇద్దరు విద్యార్థులు సోమవారం ఉదయం పాఠశాలనుంచి ఎటువంటి సమాచారం, అనుమతిలేకుండా బయటకు వెళ్లిపోయారు. ఇద్దరు విద్యార్థులు కనిపించక పోవడంతో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఆరాతీశారు. ఆచూకీ తెలియక పోవడంతో ఐటీడీఏ అధికారులు, వారి విద్యార్థుల తల్లిదండ్రులు, సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై కె.నీలకంఠం కేసు నమోదు చేసి విద్యార్థుల నివాసగ్రామాల పరిధి అరకు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందజేశారు. దీనిపై స్పందించిన అరకు పోలీసులు విద్యార్థుల స్వగ్రామాలు ముంచంగిపుట్టు, పెదబయలు గ్రామాల్లో ఆరాతీయగా అక్కడే ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ ఇద్దరు విద్యార్థులను వారి తల్లిదండ్రుల సహకారంతో అరకు పోలీస్‌స్టేషన్ నుంచి మంగళవారం సాయంత్రం సీతానగరం పోలీస్టేషన్‌కు తీసుకువచ్చారు. ఈ మేరకు విద్యార్థులను తహసీల్దార్ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో కుటుంబసభ్యులకు ఉపాధ్యాయులు అప్పగించారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

సాలూరు: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని పట్టణ సీఐ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ఇన్‌వెస్టిట్యూర్ సెరిమొని కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాయకునిగా ఉత్తమ మార్గంలో నడవడం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని అన్నారు. ఉన్నత లక్ష్యాలతో కూడిన విద్యను అభ్యసించి వాటి సాధనకు నిరంతర కృషి చేయాలని సూచించారు. పలు సమూహాల విద్యార్థి నాయకులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ రౌతు శ్రీనువాసులనాయుడు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా నగదు అందజేస్తున్న కౌన్సిలర్ హైమా విజయలక్ష్మి

సాలూరు: పట్టణంలోని 24వ వార్డు ఎరుకుల వీధికి చెందిన మూకల విజయ్‌కుమార్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం నగదును స్థానిక కౌన్సిలర్ బీసపు హైమా విజయలక్ష్మి మంగళవారం అందజేశారు. తక్షణ సాయం కింద రూ.10వేలు ఆమె అందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బీసపు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదువే లక్ష్యం కావాలి

- జనవిజ్ఞాన వేదిక



సమావేశంలో మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ

పార్వతీపురంటౌన్: విద్యార్థులకు చదువే లక్ష్యం కావాలని జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ ఎంవీఆర్ కృష్ణాజీ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం పార్వతీపురంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాల వసతి గృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులుగా బతుకులు మార్చుకోవాలంటే చదువు ఒక్కటే పరిష్కారమని తెలిపారు. చక్కగా చదువుకోవడం ద్వారా ఉపాధితో పాటు మంచి పౌరులుగా తయారవుతారన్నారు. రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన ఉండాలని సూచించారు. ఇంటర్మీడియట్, డిగ్రీ దశలో చాలా జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.రత్న కుమార్, సభ్యులు గంగాధర రావు, సంతోష్, చంద్రమౌళి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా జగనన్న పాలన

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



నూతనంగా కొలువుదీరిన ఆర్యవైశ్య సంఘ యూనియన్‌తో డిప్యూటీ సీఎం రాజన్నదొర, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తదితరులు

సాలూరు: ఆర్యవైశ్యులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, డిప్యూటి స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. పట్టణంలో ఆర్యవైశ్య ధర్మశాలలో నూతనంగా కొలువుదీరిన పట్టణ ఆర్యవైశ్య సంఘం యూనియన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మంగళవారం వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటి స్పీకర్ వీరభద్రస్వామి మాట్లాడుతూ, ఆర్యవైశ్యులకు అన్ని విధాలా అండగా ముఖ్యమంత్రి నిలుస్తున్నారని వివరించారు. ఏ అంశంలోనైనా ఆర్యవైశ్యులకు అండగా నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని వివరించారు. నియోజకవర్గానికి సంబంధించి ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర వంటి గొప్ప విలువలు కలిగిన ఉత్తమ నాయకుడు ఉండడం ఇక్కడ ప్రజలు అదృష్టమని అన్నారు. అంతకు ముందు రాజన్నదొర మాట్లాడుతూ, ఎమ్మెల్సీ పదవిని త్యాగం చేసి నాడు కాంగ్రెస్‌ను వీడి వీరభద్రస్వామి జగనన్న వెంట నిలిచారని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ తరపున తొలి టికెట్‌ను కోలగట్ల వీరభద్రస్వామికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేసారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆర్యవైశ్యులకు మంత్రి పదవి ఇచ్చారని, డిప్యూటీ స్పీకర్ పదవిని జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారని అన్నారు. ఆర్యవైశ్యులు చేస్తున్న సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు అభినందనీయమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తాను వార్డుల్లో పర్యటించినప్పుడు ఆర్యవైశ్యుల్లో అర్హులైన పేదలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇళ్లు, సంక్షేమ పథకాలు అందాయని లబ్ధిదారులు తెలిపారన్నారు. అందరు జగన్‌మోహన్‌రెడ్డికు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బ్యాంక్‌లింకేజ్ రుణం రూ.32 కోట్లు



సమీక్షాసమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం ఆర్. శ్రీరాములు

సీతానగరం: మండలంలోని మహిళా సంఘాల సభ్యుల జీవనోపాధి మెరుగు పర్చడానికి ఆర్థికంగా బలోపేతం కావడానికి కుటీర పరిశ్రమలు నెలకొల్పి పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడే విధంగా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని వెలుగు ఏపీఎం రెడ్డి శ్రీరాములు అన్నారు. ఈ మేరకు ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్‌లింకేజీ ద్వారా రూ 32 కోట్లు రుణాలుగా ఇవ్వడానికి బ్యాంక్‌లు ముందుకు వచ్చాయని చెప్పారు. మంగళవారం మండల వెలుగు సమాఖ్య కార్యాలయంలో మండల, క్లస్టర్ కో ఆర్డినేటర్లతో బ్యాంక్ లింకేజీ రుణాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యుల జీవనోపాధి మెరుగు పర్చడానికి వాణిజ్య పరంగా అభివృద్ధి చెందడానికి పొదుపు సంఘాల సభ్యుల భాగస్వామ్యంతో మండలకేంద్రంలో మార్ట్‌లు ఏర్పాటు చేసేందుకు సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లతో పాటు క్లస్టరు కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

320 లీటర్ల సారా స్వాధీనం



పట్టుబడిన సారా కేన్లతో ఎక్సైజ్ సిబ్బంది

పార్వతీపురం:

సారా శిబిరాలపై దాడులు నిర్వహించి 320 లీటర్ల సారాను, ఏడు సైకిళ్లను స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్. ఉపేంద్ర మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పాటిల్, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర ఆధ్వర్యంలో దాడులు నిర్వహించామన్నారు. పార్వతీపురం మండలంలోని కొత్తూరు గ్రామ సమీపంలో కొండమార్గాన సారా క్యాన్‌లతో ఉన్న సైకిల్స్‌ను వెంబడించగా నిందితులు సైకిల్స్ విడిచిపెట్టి పరారయ్యారని చెప్పారు. దీంతో ఏడు సైకిల్స్, 320 లీటర్ల సారా క్యానులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సారా సరఫరాచేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన ఊయక సుబ్బు, ఊయక మల్లేష్‌తో పాటు పట్టణానికి చెందిన మరో ఇద్దరిపై కేసు నమోదుచేశామని వివరించారు. దాడుల్లో ఎస్సై రమణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

2300 లీటర్ల సారా ధ్వంసం

వివిధ కేసులలో పట్టుబడిన 2300 లీటర్ల సారాను ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం ధ్వంసంచేశారు. గడిచిన రెండు నెలలలో 50 కేసులలో పట్టుబడిన సారాను ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆర్.సుధాకర్ ఆధ్వర్యంలో నవిరి కాలనీ సమీపంలోని పాత తోటపల్లి రహదారిలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సీఐ ఎల్.ఉపేంద్ర ఉన్నారు.

మిశ్రమ పంటల సాగుకు రైతుల ఆసక్తి



పణుకుపేటలో అరటి-పామాయిల్ మిశ్రమ పంట



బగ్గందొరవలసలో మినుము-పామాయిల్ మొక్కల సాగు

సీతానగరం: వాతావరణం అనుకూలించడంతో మండలంలోని పలు గ్రామాల రైతులు మిశ్రమ పంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా పంటల సాగుకు పెట్టుబడి నిధులు సమకూరుస్తుండడంతో మిశ్రమపంటలు వేయడంలో నిమగ్నమయ్యారు. గ్రామాల్లో ఏడాది పొడవునా ఒకే పంటసాగు చేయడం వల్ల ఆర్థికపరమైన ఇబ్బందులున్న కారణంగా పనిచేస్తూ ఆదాయాన్నిచ్చే పంటలను ఎంపిక చేసుకున్నారు. ప్రధానంగా రైతులు వాణిజ్యపంటగా ఎంపిక చేసుకున్న చెరకు కొనుగోలు చేయాల్సిన సుగర్ ఫ్యాక్టరీ మూతపడ్డం, దూరప్రాంతంలో ఉన్న కర్మాగారానికి తరలించలేని చిన్న సన్న కారురైతులు చెరకు సాగు విస్తీర్ణం తగ్గించి అరటి, మొక్కజొన్న, కూరగాయలు, అపరాల పంటలను సాగు చేస్తున్నారు. రైతులు వేసిన పామాయిల్ మొక్కలద్వారా నాలుగు సంవత్సరాల వరకూ ఫలసాయం రాదు. కలుపు విపరీతంగా పెరిగిపోతుంది. మిశ్రమ పంటలు సాగు చేయడంతో ఆర్థికంగా వెసులుబాటు కలుగుతుందన్న నమ్మకంతో నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో 300 ఎకరాల్లో అంతర పంటలుగా పెసర, మినుము, అరటి, ఉలవలు, మొక్కజొన్న, కూరగాయల పంటలు సాగు చేస్తున్నారు. మండలంలోని అప్పయ్యపేట, చినభోగిలి, తామరఖండి గ్రామాల్లో మిశ్రమ పంటలసాగు గురించి ఉద్యాన శాఖ అధికారి ప్రత్యూష వద్ద ప్రస్తావించగా సాధారణ పంటల కన్నా అదనంగా ఆదాయం వస్తుందని గుర్తించిన రైతులు మిశ్రమ పంటల సాగుపై ఆసక్తి చూపుతూ కూరగాయలు, అపరాలు సాగు చేస్తున్నారన్నారు.

వారం వ్యవధిలోనే ధ్రువీకరణ పత్రాలు

- ఎమ్మెల్యే జోగారావు



వెంగాపురంలో లబ్ధిదారుకు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: జగనన్న సురక్ష పథకం ద్వారా లబ్ధిదారు దరఖాస్తు చేసుకున్న వారం రోజుల లోపే 11రకాల సేవలకు చెందిన ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని వెంగాపురం, తుమరాడ సచివాలయాల పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వారికి కావాల్సిన ముఖ్య సేవలకు సంబంధించి తక్షణమే పరిష్కారం లభించేలా జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. ఈ పథకంతో సేవలు మరింత సులువుగా, పైసా ఖర్చు లేకుండా, ఎటువంటి శ్రమ పడకుండా, ఎంతో కాలం నుంచి పరిష్కారం జరగనవి పరిష్కరించే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అమ్మడమ్మ, కనకమహాలక్ష్మి, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీపీ నాగమణి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, ఎంపీటీసీ మురళి, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు జి.శ్రీరాములునాయుడు, కె.గోపి నాయుడు, జి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు సర్వే

అజ్జాడ సచివాలయం పరిధిలో ఉన్న పి.చాకరాపల్లిలో జగనన్న సురక్ష పథకానికి సంబంధించి సర్పంచ్ కె.మోహనరావు ఆధ్వర్యంలో వలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు. 11రకాల సేవలకు సంబంధించి ఎవరికి ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు అవసరమో సమాచారం నమోదుచేసుకుంటున్నారు. ఈ పథకంతో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా, వారం రోజులలోపు నేరుగా అందుతాయని సర్పంచ్ మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం



తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న జగనన్న సురక్ష గ్రామసభల్లో ప్రజా సమస్యలు పరిష్కారమవుతున్న కారణంగా రైతులు ఎదుర్కొంటున్న భూముల సమస్యల పరిష్కారం కోసం అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ కోరారు. ఈ మేరకు మంగళవారం బగ్గందొరవలస, పెదభోగిలి గ్రామాల్లో జగనన్న సురక్ష పథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల భూముల క్రయ, విక్రయాలు, చేర్పులు మార్పులు చేసుంటున్నప్పటికీ రికార్డుల్లో మార్పు చేయించుకోవలసి అవసరం ఉందన్నారు. అసైన్డ్ భూమిగల రైతుపేరున నమోదు కాకపోవడంవల్ల ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందలేకపోవచ్చన్నారు. అలాగే కుటుంబ యజమాని భౌతికంగా లేకపోవడం వల్ల తమకున్న భూములను అనధికారికంగా సాగు చేస్తున్నప్పటికీ లెక్కదాఖలా వర్తించదన్నారు. అటువంటి భూములున్న రైతులు వారసత్వపు సర్టిఫికెట్ పొందిన తరువాత మ్యుటేషన్‌కు దరఖాస్తు చేయాలని స్పష్టం చేశారు.

జగనన్న సురక్ష వినియోగించుకోవాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు వినియోగించు కోవాలని సీతానగరం మండల వైస్ ఎంపీపీ టి సూర్యనారాయణ, సచివాలయ కన్వీనరు జి.శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు జగనన్న సురక్ష అమలులో భాగంగా మంగళవారం నిడగల్లులో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఏదో రూపంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.ఆరుద్రమ్మ, ఉపసర్పంచ్ బి.సింహాచలం, సచివాలయ కన్వీనర్లు పి.తిరుపతినాయుడు, టి.అన్నపూర్ణమ్మ, గ్రామ వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



జగనన్న సురక్ష ఇంటింటి సర్వేలో మాట్లాడుతున్న వైస్‌ఎంపీపీ సూర్యనారాయణ, జి.శ్రీనివాసరావు

‘జగనన్న సురక్ష’తో సమస్యల పరిష్కారం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పాచిపెంట: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం తెచ్చిందని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండల కేంద్రంలోని మినీ గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేస్తున్న ప్రజలకు మంజూరు చేసిన ధ్రువపత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రజల వద్దకే వచ్చిందన్నారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని అన్నారు. సంక్షేమ పథకాలకు అవసరమైన అనేక ధ్రువపత్రాలు ఈ కార్యక్రమం ద్వారా పొందుతున్నారన్నారు. ప్రజల కోసమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ఆలోచిస్తూ వారి సంక్షేమం కోరి గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న సురక్ష వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రజల వద్దకు పంపుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు మీసాల నారాయణమ్మ, కొండలరావు, డోల బాబ్జి, టి.గౌరిశ్వరరావు తదితరుల పాల్గొన్నారు.

మినీ గురుకులాన్ని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి

స్థానిక మినీ గురుకుల పాఠశాలను ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెడుతున్నారా.. లేదా.., వసతి సదుపాయాలు తదితర అంశాలపై ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే తనకు తెలపాలన్నారు. మిమ్మల్ని చదివిస్తున్నది ఎవరని రాజన్నదొర విద్యార్థులను ప్రశ్నించగా జగన్ మామయ్య అంటూ విద్యార్థులు ముక్తకంఠంతో తెలిపారు. విద్యార్థులంతా ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానం పక్కాగా అమలు చేయాలి



అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానం పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన పార్వతీపురం మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు, ఓపీ యూనిట్, జనరల్ వార్డ్, డ్రగ్స్ స్టోర్, శానిటేషన్‌ను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి వారికి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ శిబిరం ఆదర్శప్రాయంగా ఉండాలని స్పష్టం చేశారు. అలాగే జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారికి ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం అందుతుందో లేదో అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో 1,2 అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించి పిల్లలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలను ఆదేశించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయంలో జల్‌జీవన్ మిషన్, ఇతర పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎస్టీ కమిషన్ ఛైర్మన్



ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్రావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం టౌన్: ఎమ్మెల్యే జోగారావును రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్రావు మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు ఘనస్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధిపై ఇద్దరూ చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, వైస్‌ఎంపీపీలు సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, కౌన్సిలర్‌లు నిమ్మకాయల సుధీర్, చిన్నం నాయుడు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పొరపాటున ఫినాయిల్ తాగి అస్వస్థత

పార్వతీపురం: కొమరాడ మండలం అర్తాం గ్రామానికి చెందిన రాగోలు రమేష్ పొరపాటున ఫినాయిల్ తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరాడు, మంగళవారం జరిగిన ఈ సంఘటనపై ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రమేష్‌కు మద్యం తాగే అలవాటుంది. ఈ క్రమంలో మద్యం తాగి ఇంటికి వెళ్లిన రమేష్ బాత్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో మంచి నీరు అని భావించి పొరపాటున ఫినాయిల్ తాగేశాడు. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.



చికిత్స పొందుతున్న రమేష్